# ఆ ఉన్మాదికి ఉరే సరి




## నినదించిన నగర ప్రజలు

వనం నాగయ్య, కెరటం న్యూస్

ఖమ్మం జిల్లాలో 12 సంవత్సరాల అమాయక బాలికపై జరిగిన అత్యాచార ఘటన సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇటువంటి అమానుష ఘటనలు నాగరిక సమాజానికి మచ్చగా నిలుస్తాయని శ్రీరక్షా సంస్థ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా 30 నుంచి 40 రోజుల వ్యవధిలోనే విచారించి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ, డా.జి.వి. ఆధ్వర్యం లో ఖమ్మం ఫ్రీడమ్ పార్క్‌లో వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. జి.వి, సామాజికవేత్త పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత ఏకో క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ



ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డా.కడవెండి వేణుగోపాల్ మాట్లాడుతూ, బాలికలపై జరుగు తున్న లైంగిక దాడులు సమాజం లో పెరుగుతున్న నైతిక విలువల క్షీణతకు సంకేతమని పేర్కొన్నారు. చిన్నారుల భద్రత ప్రతి కుటుంబం, సమాజం మరియు ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలంటే వేగవంతమైన విచారణతో పాటు నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వాకర్స్ క్లబ్ సభ్యులు కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, మహిళలు మరియు బాలికల భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాల అమలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, మరియు బాధితులకు తక్షణ న్యాయం అందే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు సామాజిక కార్యకర్తలు, వాకర్స్ క్లబ్ సభ్యులు, మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని బాధిత బాలికకు సంఘీభావం ప్రకటించి ఆమెకున్యాయం కావాలన్నారు.





